**100**
**ధారావాహిక**



# జాయ సేనాపతి

**చారిత్రక కాల్పనిక నవల**

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** ఓ రాత్రివేళ.. ఓవైపు నుంచి కుర్రాళ్ల మాటలు - పాటలు. మధ్యమధ్యలో డప్పు శబ్దం! 'డప్పు.. సంగీతానికి పనికిరాదు!' అని విన్న జాయపుడు.. ఇక్కడ డప్పుపై సరిగమలు విని ఆశ్చర్యపోయాడు. ఆగలేకపోయాడు. లేచి డప్పువాదన వినవచ్చిన వైపుగా వెళ్లాడు. ఒక గొడ్ల చావిడి దగ్గర కొందరు కుర్రాళ్లు డప్పులు వాయిస్తూ.. తదనుగుణంగా చిందువేస్తూ కనిపించారు. వారి దగ్గరికి వెళ్లి.. ఒకరి చేతిలోని డప్పును తీసుకుని సున్నితంగా ఓ దరువు వేశాడు. ఓ కులీనుడు తమ డప్పు తీసుకోవడం.. చంకకు పాదవుకొని వాయించడం.. ఆ బృందం కొయ్యబారిపోయింది. చకితులై ఆయన చుట్టూ చేరారంతా! తెల్లార్లూ అక్కడ డప్పుతో.. మోతో మోత!! చిందో.. చిందు!!

**ఇప్పుడు**

'ప్రతిరాత్రి వసంతరాత్రి.. డప్పు సంగీత రాత్రి' అయ్యిందా వాడలో! డప్పువాద్యగాడు సూరప్పడు.. ఇప్పుడు జగన్నాథుడు అనబడే జాయపునికి ప్రియ శిష్యుడైపోయాడు.

ఎంత కవి, పండితుడు, రచయిత అయినా.. సహజంగా జాయపుడు నాట్యకారుడు. ఉప్పెన వల్ల వచ్చిచేరిన ఈ కూసెనపూండి వద్ద ఈ ఆరుమాసాల కాలంలో ఓ వృద్ధ గుడిసానిని, ఓ డప్పువాద్య బృందాన్ని, ఓ నాట్యగురువు భాగవతుల సిద్ధయను.. గుర్తించాక ఈ ప్రాంతంపై మక్కువ ఏర్పడింది. ద్వీపరాజ్యంలో నాట్య ప్రసక్తి ఎక్కువగా ఉండటంతో జాయపుడు ఇక్కడ తనే ఓ నాట్య కళాక్షేత్రాన్ని నిర్మించాలని భావించాడు. తన ఆలోచనను భాగవతుల సిద్ధయతో పంచుకోవడానికి అతని నాట్యగృహానికి వెళ్లాడు. అప్పుడే శిక్షణ పూర్తయ్యి పిల్లలు బిలబిలమంటూ దూకుడుగా బయటికి వచ్చి జాయపుడిపై పడ్డారు. తక్షణమే అతనికి తలగడదీవి కోటలోని పిల్లలు.. వెంటపడి చంకనెక్కి ఆడిపాడే పసిపిల్లలు.. తన కుటుంబం.. బంధుమిత్రులు, ప్రాణంపెట్టే ముదుసలి పినతండ్రి.. అందరూ గుర్తొచ్చారు. మనసు ఇంటిపై బెంగతో అనురాగ రంజితమయ్యింది.

* * *

కోటకు వచ్చిన జాయపునికి పిల్లలంతా బిలబిలమని ఎదురేగి మీదపడి ఆహ్వానం పలికారు. మహిళలంతా హారతులిచ్చి లోపలికి గొనిపోయారు. తల్లిదండ్రులు గుర్తొచ్చారు జాయపునికి. వాళ్లిద్దరూ లేకున్నా అన్నదమ్ములంతా తనపట్ల అవ్యాజానురాగాన్ని ప్రదర్శించడం అతణ్ని కదిలించింది. ఇంత బాధ్యతారాహిత్యంతో తిరిగేవాణ్ని వర్తమాన రాజకుటుంబాలలో ఎవ్వరూ భరించలేరు. కానీ, తనవాళ్లు తనకిచ్చే గౌరవం ఇంతా అంతా కాదు. లోపలికి సరాసరి బ్రహ్మయచోడుని తల్పం వద్దకు వెళ్లాడు. ఆయన లేవలేనిస్థితిలో కూడా జాయపుని కోసమే కళ్లలో వత్తులు వేసుకుని చూస్తున్నాడు.

''వచ్చావా.. తండ్రీ! నీ కోసమేరా బతికి ఉన్నాను!''.

ఆయన హత్తుకుని ఏడుస్తుంటే తనను తాను నిగ్రహించుకోవడం కష్టమయ్యింది జాయపునికి.

''మీ అభిమానమే నా కవచం. ఏ ఉప్పెనా నన్ను చంపలేదు. బావగారి పాలనలో యుద్ధాలు కూడా లేవు కదా.. చేతినిండా పనిలేదు. అందుకని గ్రామాల్లో జానపదుల పాటలు వింటూ తిరుగుతున్నాను!''.

కాస్త హాస్యం మిళితంచేసి నవ్వించి అందరి హృదయాలలోని భారాన్ని తగ్గించాడు.

మళ్లీ పిల్లలతో నాట్యాభ్యాసం మొదలుపెడితే ఆరోగ్యం కుదుటపడింది. తిరిగి ఉత్సాహం పెరిగింది.

ఆలోచనలన్నీ కూసెనపూండి చుట్టునే పరిభ్రమిస్తున్నాయి. వెలనాడులో కృష్ణమ్మకు ఆవలిఒడ్డు సనదువోలు వైపున్న పండితులు లిఖిత సాహిత్యంలో ప్రావీణ్యులైతే.. కృష్ణమ్మ ఈవల ద్వీపరాజ్యవాసులు ప్రదర్శన కళల్లో ప్రావీణ్యులని జాయపుని పరిశీలన. ఆ రెండుగ్రామాల పరిధిలో మూడు కళాబృందాలు కనిపిస్తే.. మొత్తం వెలనాడులో సోమాంబిక లాంటి మరుగునపడ్డ మహాకళాకారులు, కూసెనపూండి లాంటి మరిన్ని గ్రామాలు, డప్పు సూరప్పడు లాంటి గుర్తింపునకు నోచుకోని నిమ్న వర్గాల కళాకారులు, ఉపకులాల దాసరులు, సంచార కళాబృందాలు.. లాంటి మొత్తం కవిపండిత, గేయ, నాట్య, వాద్యకారులనందర్నీ గుర్తించాలి. ఒక్కచోట చేర్చాలి!!